డా॥ ముక్తేవి భారతి

# ప్రక్షాళనం

తలుపు చప్పుడవటంతో తలెత్తి చూసింది వీణ. తలుపు దగ్గరగా వేసి నెమ్మదిగా వచ్చి పక్కన నిలబడింది కామాక్షమ్మ.

చేతిలోవున్న పుస్తకం పక్కనపెట్టి, "ఏమిటి పిన్నిగారూ" అంది వీణ.

"మావారొచ్చారా?" గొంతు తగ్గించి అతి రహస్యంగా అడిగింది కామాక్షమ్మ.

"నాకేం తెలుసూ!" ఆశ్చర్యంగా అంది వీణ.

"అదే, అదొచ్చిందా" -

"అదెవరూ!"

కామాక్షమ్మ పక్కనున్న కుర్చీ జరుపుకుంది. "అదే లలిత" అంది నెమ్మదిగా.

లలిత ఇంటివాళ్ళమ్మాయి. పెళ్ళయి ఏడాదయింది. భర్త గద్వాలలో ఉద్యోగం. అయితే, లలిత పుట్టింటికి వస్తూపోతూ ఉంటుంది. పొద్దున్న వచ్చి రాత్రి బస్సులో వెళ్ళిపోవటం కూడా వీణకి తెలుసు. పైగా పక్క వాటాలో అద్దెకుంటున్న వీణ కుంటుంబం, ఇంటివాళ్ళతో స్నేహంగా ఉంటుంది... కానీ, కామాక్షమ్మగారు "మావారొచ్చారా" అని తనని అడగటం మాత్రం అర్థం కాలేదు వీణకి.

"మీరేమంటున్నారో నాకు అర్థం కావటం లేదు" అంది వీణ ముఖం కొంచెం చిరాగ్గా పెట్టి. అంతలో ఇంటావిడ గొంతు వినిపించటంతో కామాక్షమ్మ వస్తానని వెళ్ళిపోయింది.

వీణ చేతిలో పుస్తకం ఉంది కానీ మనసెక్కడో ఉంది... లలితని తను అక్కా అని పిలుస్తుంది. స్కూలుకి సెలవలిచ్చినప్పుడు లలిత రావడమేకాక, భర్త శేఖరుని కూడా వెంటబెట్టుకొస్తుంది. రెండు రోజులుండి అతను వెళ్ళిపోతాడు. లలితక్క అంటే చాలా ఇష్టం వీణకి. లలిత రావడం, 'మావారొచ్చారా" అని కామాక్షమ్మగారు అడగటం - ఏమిటీ - ఏమో?

కామాక్షమ్మ వెంకటేశ్వరావు భార్య. లలిత ఇంటికి కామాక్షమ్మ, ఇంటికి ఒక్క సందు దూరం. చదువుకుంటున్న వీణకి ఆమె పద్ధతి అర్థం కావటంలేదు. కామాక్షమ్మగారు ఎంతో అందంగా, తెలివిగా ఉంటుంది. ఆమె వయసులో సగం ఉన్న తనతో ఆవిడ స్నేహంగా ఉండాలని ఎందుకు ప్రయత్నిస్తోందో ఎంత ఆలోచించినా తెలియటం లేదు. "మావారొచ్చారా" అని ఎంతో రహస్యంగా వచ్చి తన్నెందుకలా అడిగిందో ఎంతకీ అంతుపట్టలేదు వీణకి... వీణ గబగబా లేచింది.

"ఆంటీ, లలితక్క ఉందా, ఈ లెక్క చెప్పించుకోవాలి" గబగబా ఇంటివాళ్ళ గదిలోకెళ్ళింది వీణ.

"లలిత పనిమీద పబయటికెళ్ళిందిగా రెండు గంటలకొస్తుంది. మళ్ళీ సాయంత్రం బస్సుకి వెళ్ళిపోతుంది... మరి నీ లెక్కలు - లలిత తల్లి జయమ్మ ఏదో అంటుంటే, "సరే ఆంటీ, మళ్ళీ వస్తా" వెళ్ళిపోయింది వీణ.

లలిత రెండు గంటలకొస్తుంది అనే మాట మనసులో మెదలుతోంది వీణకి. అన్నం తినటం, కాసేపు టి.వి. చూడ్డం అయ్యాక గడియారం వంక చూసింది వీణ. పది నిమిషాలు తక్కువ రెండు...

వీధి గేటు బయటకొచ్చి ఏదో పనున్నట్టు నిలబడింది వీణ... జామకాయల బండిని ఆపి కొన్ని జామకాయలు కొంది. గడియారం రెండు గంటలు కొట్టడం వినిపించింది... అలా వీణ చూస్తుండగానే సందు చివర ఒక్క క్షణం ఆటో ఆగటం, మరుక్షణంలో ఇంటి ముందు ఆటో ఆగటం, లలిత ఆటో దిగి డబ్బులిచ్చేయటం జరిగిపోయింది.

ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ లోపలికొచ్చింది లలిత. వీణ గబగబా ఇంట్లోకొచ్చేసింది. కామాక్షమ్మగారింట్లోకెళ్ళి - "ఈ ఆటోలో సందు దగ్గర దిగింది బాబాయిగారా" అని అడిగితే - హమ్మో! నాకెందుకు అనవసర విషయాలు వీణ ఊపిరి బిగపట్టుకుని దగ్గరకొచ్చింది మళ్ళీ.

డిగ్రీ పరీక్షల సందడి మొదలైంది. వీణ స్నేహితురాలింటికి కంబైండ్ స్టడీస్‌కి వెడుతూ, ఒక్క నిమిషం తీరిక లేకుండా ఉంది. కామాక్షమ్మ రెండుసార్లు తలుపు తోసుకొచ్చి చూసినా వీణ కనబడలేదు.

"అయినా ఎంతకాలం దాగుతుందీ" నసుక్కుంటూ ఇంట్లో కొచ్చిన కామాక్షమ్మకి వీధి చివర నిలబడి మాట్లాడుతున్న భర్త వెంకటేశ్వరరావు కనిపించాడు. కామాక్షమ్మ కోపంతో మండిపడిపోతూ "మన బంగారం మంచిదికానప్పుడు ఒకర్ననుకుని ఏం లాభంలే" అంది పైకి వినిపించేలా.

"బంగారమేమిటీ - కొనుక్కున్నావా" వెంకటేశ్వరరావు కామాక్షితో అన్నాడు.

"నా బతుక్కి అదొక్కటే తక్కువ" విసుగ్గా వంటగదివైపు నడిచింది. కామాక్షి బాధేమిటో తెలుసు - కానీ ఆమెను ఏ విధంగా తన మాటలతో నమ్మించగలడు!! - అన్నింటికీ కాలమే సమాధానం!!

వెంకటేశ్వరరావు అలా పడుక్కుర్చీలో పడుకున్నాడు. గతం ఒక్కసారి కదిలింది... ఆనాటి రోడ్ యాక్సిడెంటు... అప్పుడే డ్రైవింగ్ నేర్చుకుంటూ అడ్డం వచ్చిన లలిత... డ్రైవ్ చెస్తున్న తను దెబ్బలతో బయటపడటం - అడ్డం వచ్చిన లలిత అటుపడటం - స్కూటర్ తుక్కు అవటం - కానీ, గుండె అడుగున దాగిన భయంకరమైన నిజం - సూర్యం మరణం!! సూర్యం తన ప్రాణ స్నేహితుడు - కష్ట సుఖాలు ఒకరికొకరు చెప్పుకుంటూ కలిసి చేసిన ఉద్యోగం - వెంకటేశ్వరరావు కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి!!

సూర్యం భార్య ఆనాడు అచేతనురాలై పోవటం, కొడుకు రవి, శవం వెంట నడవటం - అబ్బా!! వెంకటేశ్వరరావు అప్రయత్నంగా తల పట్టుకున్నాడు! పెళ్ళీ ఆలస్యంగా చేసుకున్నాడు సూర్య. పిల్లాడూ ఆలస్యంగా పుట్టాడు! వెంకటేశ్వరరావు గతంలో పూర్తిగా మునిగిపోయాడు. గదిలో చీకట్లో అలాగే కుర్చుండి పోయాడు.

సూర్యం పోయిన మూడోరోజున అడ్రసు వెతుక్కుని వచ్చింది లలిత ఆ ఇంటికి "బాబాయిగారూ" - అప్రయత్నంగా తలెత్తాడు వెంకటేశ్వరావు.

"నా వల్లే ఆ కుటుంబానికి ఈ కష్టం కదూ" లలిత గొంతు వణికింది. వెంకటేశ్వరరావు మాట్లాడలేదు. ఆ తరవాత ఆర్నెల్లకి లలిత, వెంకటేశ్వరావుని ఆఫీసులో కలిసింది.

"మా ఇంటికీ మీ ఇంటికీ ఒక సందే అడ్డం" అంది ఆ తరవాత నెల రోజులకి వెంకటేశ్వరరావు ఇంటికెళ్ళింది లలిత. ఆమెని చూసి కొంచెం ఆశ్చర్యపోయాడు. ఆ మాటలూ ఈ మాటలూ అయ్యాక, సూర్యం కుటుంబం గురించి ఎంతసేపో మాట్లాడుకున్నారిద్దరూ. మధ్యమధ్యలో కర్టెన్ కదులుతూనే వుంది... లలిత వెళ్ళిపోయింది.

"ఎంతసేపు దాంతో కబుర్లూ" దీర్ఘం తీసింది కామాక్షమ్మ.

"కబుర్లేమిటీ - పాపం, సూర్యం లేడూ, అదే నా ఫ్రెండు, వాడి కుటుంబం విషయం" వెంకటేశ్వరరావు మాట పూర్తి చేయనేలేదు "ఓహో, మీరూ, అదీ ఆ కుటుంబాన్ని ఉద్ధరిస్తారు కాబోలు..."

వెంకటేశ్వరరావు మాట్లాడకుండా చెప్పులు తొడుక్కుని బయటికి వెళ్ళిపోయాడు. ఆ క్షణంలోనే నిశ్చయించుకున్నాడు, నిజంగానే ఆ కుటుంబాన్ని ఉద్ధరించాలని.

లలిత పెళ్ళయి వెళ్ళిపోయినా, వచ్చినప్పుడల్లా వెంకటేశ్వరరావుని కలుస్తుంది. వెంకటేశ్వరరావు లలిత ఇంటికొస్తాడు. అలా వాళ్ళిద్దరూ బయటకొచ్చి నడుస్తుంటే సందు చివర నిలబడి చూస్తున్న కామాక్షి ఒళ్ళు భగభగ మండిపోతోంది.

"ఎక్కడికెడతారు ఇద్దరూ? అయినా ఊరినుంచి పనికట్టుకుని ఇదెందుకొస్తున్నట్టు?

కామాక్షమ్మ ఆలోచనలకి అంతులేకపోయినా, తన భర్త ఏం చెప్పినా తను నమ్మలేను అనే భావం మనసులో బాగా నాటుకుపోయింది. "వయసేమిటీ? అయినా మగాడికి బుద్ధి లేకపోతే దీనికుండొద్దూ! ఛీ, ఆ మొగుడికి తెలిసే వస్తోందా - థూ... థూ..."

కామాక్షమ్మ చాలా కోపంగా, వీణ దగ్గరకొచ్చింది ఓ సాయంత్రం.

"రండి పిన్నిగారూ - నా పరీక్షలయిపోయాయి... " అంది వీణ చాలా సంతోషంగా.

"అది సరే... మావారొచ్చారా" అంది నెమ్మదిగా.

వీణకి చాలా కుతూహలం పెరిగిపోయింది. "కూర్చోండి పిన్నిగారూ... ఇంటివాళ్ళంతా ఎక్కడికో వెళ్ళారు... చెప్పండి. ఏమిటీ?" అంది.

కామాక్షమ్మ తీరిగ్గా కూర్చుంది.

"నువ్వు చిన్నదానివి - అయినా నా పిల్లలాంటిదానివి - నా మనసులో మాట చెప్పుకుంటున్నా" కామాక్షమ్మ గొంతువణికింది.

"అదే... జీతం వచ్చేసరికి వచ్చి వాలుతుంది - ఈయనేమో ఏం ఖర్చు చేస్తారో ఏమో చెప్పరు - ఇదే తంతు - అయినా దానికీ, ఈయనకీ ముప్ఫై ఏళ్ళు తేడా ఉంటుందా మరి!"

వీణకి చాలా అసహ్యంగా అనిపించాయి ఆ మాటలు. ఈ పిన్నిగారు అనుమానంతో లలితని అపార్థం చేసుకుంటోందనిపించింది.

"లలితక్క మంచిది పాపం" -

"అక్క అనకు దాన్ని... కొంపలు కూలుస్తోంది."

"ఛీ..ఛీ.." - వీణ వెంటనే అనేసింది. కానీ కామాక్షమ్మ మాట్లాడలేదు. వీణకి ఏమీ అర్థం కావటం లేదు.

"నా కోసం ఒక్క సాయం చేస్తావా?" అంది కామాక్షమ్మ "చెప్పండి."

వీణ తల్లీతండ్రీ ఊళ్ళో ఉంటారు వ్యవసాయం పనులు చూసుకుంటూ. వీణ అమ్మమ్మ వండిపెడుతోంది. లోపల నుంచి దగ్గు వినిపించటంతో, కామాక్షమ్మ కంగారుగా "మీ నాన్నగారున్నారా" అంది.

"అమ్మమ్మ లెండి - చెప్పండి" అంది వీణ.

"వాళ్ళిద్దరూ ఎక్కడికెళుతున్నారో నాకు చెప్పాలమ్మా ఎలాగా" అంది విచారంగా. వీణకి నవ్వొచ్చింది. తనిప్పుడు డిటెక్టివ్‌లా పనిచేయాలన్నమాట!

గేటు చప్పుడవటం లలిత లోపలికి రావటం ఒకేసారి జరిగింది. కామాక్షమ్మను చూసి - "బావున్నారా... రండి మా ఇంట్లోకి" అంది లలిత కామాక్షమ్మ క్షణం విస్తుపోయింది.

"ఎక్కడనుంచి వస్తున్నావూ?... మీవారు వచ్చారా" అంది నిలబడే కామాక్షమ్మ.

"మావారికి తీరికెక్కడ? ఆయన రారు. నేనే వస్తూ ఉంటా. రాకపోతే నాకు తోచదు" అంది లలిత ఇంట్లో కెడుతూ.

కామాక్షమ్మ వెళ్ళిపోయింది. "లలితక్కా, ఎక్కడికెళ్ళావు? సినిమాకా?" అంది వీణ లోపలికొస్తూ.

"చచ్చినా చెప్పను, ఎక్కడి నుంచి వస్తున్నానో" పకపక నవ్వింది లలిత.

వీణ మాట్లాడకుండా ఇంట్లోకెళ్ళిపోయింది. "పిన్నిగారి అనుమానం నిజమేనేమో - ఏమో" - వీణ మనసు ఎటో పరిగెత్తింది.

నిజమే నెల అయేసరికి కచ్చితంగా వస్తుంది లలితక్క ఎందుకనో! నిజమే, పిన్నిగారికి చెప్పకుండా బాబాయిగారు జీతంలో కొంత ఏం చేస్తున్నట్టూ? పైగా 'నిజం చెప్తే నీవు నమ్మవుగా' అంటారట.

"ఛీ, మగాళ్ళంతా ఇంతేనా - ఏమో?" వీణకి పిన్నిగారిమీద విపరీతమైన జాలేసింది. "పాపం, పిన్నిగారు!!"

ఒకరికి సహాయం చేయడంలోనూ, ఒకరి కష్టంలో అదుకోటంలోనూ, ఒకరి బాధని అర్థం చేసుకోటంలోనూ ఎలాంటి నమ్మకమూ లేని కామాక్షమ్మ - ఆనాడు సూర్యం మరణించాడని విన్నాక, 'ఏం చేస్తాం, ఎవరి ఖర్మ వాళ్ళదీ - అందే కానీ, పాపం, ఆ కుటుంబ పరిస్థితి ఏమిటో అని ఆలోచించకపోగా "ఆ పిల్లది నష్టజాతకం, అంతే" అని అనుకుంది మనసులో...

"మనిద్దరికీ ఎలా కుదిర్చాడో దేవుడు కామూ" అన్నాడు ఓనాడు వెంకటేశ్వరరావు పూలు కడుతున్న భార్యవైపు చూసి. "అడవిలో ఉసిరికాయ, ఊరిలో ఉప్పురాయి ఉన్నట్టు అంతే లేండి - అయినా దేవుడెందుకు కుదిర్చాడు! మీ నాన్న మానాన్న వెంటబడి పిల్ల అందంగా వుంది బుద్ధిమంతురాలని అడిగితే, మా నాన్న సరే అన్నాడు" కామాక్షమ్మ సిగలో పూలు చుట్టుకుంటూ అంది.

"పిల్ల అందగత్తె సరే - బుద్ధిమంతురాలా అనేదే..." వెంకటేశ్వరరావు పక్కున నవ్వారు.

కామాక్షి కళ్ళు బుగ్గలు క్షణంలో ఎరుపెక్కాయి. "కాకపోతే ఈ సంసారం ఎలా సాగుతోందీ - మీరు ఆడింది ఆట, పాడింది పాట - దాన్ని వెంటేసుకు తిరుగుతుంటే నోరు మూసుకు ఊరుకోటంలేదూ - ఇదంతా నా ఖర్మలెండి, నెల జీతం ఎవరెవరికి పంచి పెడుతున్నారో నాకేం తెలుసూ..." కామాక్షి గొంతు పెంచింది.

"అయినా ఈ మారు రానియ్యండి దాన్ని, కాళ్ళు విరగ్గొడతా..." అరుస్తోంది కామాక్షమ్మ.

"నోర్ముయ్ - పిచ్చివాగుడు" వెంకటేశ్వరరావు చెప్పులు తొడుక్కుని బయటకి వెళ్ళిపోయాడు. సరసంగా మొదలైన సంభాషణ విరసంలో పూర్తయింది ఆ సాయంత్రం "ఒక్క సారయినా ఇది అబద్ధం అనడేం -?

ఎందుకంటాడూ,

ఇది పచ్చి నిజం, నిజం!! ఈ విషయం ఇక తేల్చేయాలి, భరిస్తోంది తను - ఇంత కిరసనాయిలు నెత్తిని పోసుకు చస్తే - చస్తే ఎవరికి చింత? వాళ్ళు కోరుకుంటున్నదే అదిగా-" కామాక్షమ్మ పూర్తిగా దెయ్యం పట్టినదానిలా గట్టిగా అరుస్తూ, అటు ఇటూ తిరగటం మొదలు పెట్టింది.

తలుపు ధనాధనా బాదుతున్నారెవరో! కామాక్షమ్మకి తలుపు తీయాలనిపించలేదు. మళ్ళీ తలుపు చప్పుడు.

"ఆంటీ, ఆంటీ"-

కామాక్షమ్మ గబగబా కళ్ళు తుడుచుకుంది. బొట్టు దిద్దుకుని తలుపు తీసింది

"ఆంటీ" -

"ఇది మీ ఉత్తరం. మా ఇంట్లో పడేశాడు పోస్ట్‌మేన్ అమ్మ మర్చిపోయిందట మీకివ్వటం" అంటూ కవరు చేతికిచ్చి పక్కింటి చిన్నా వెళ్ళిపోయాడు. ఆ ఉత్తరం దిండు కింద పడేసింది కామాక్షమ్మ. ఆ మంచం మీద అలానే నిద్రపోయింది.

కాలం పరిగెడుతోంది. కామాక్షమ్మ మనసు రకరకాల ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. పదిహేను రోజులుగా భార్యాభర్తల మధ్య నిశ్శబ్దం తాండవిస్తోంది. మనసు బాగాలేనప్పుడు కల్పించుకుని పనులు చేయటం కామాక్షమ్మ అలవాటు. ఇల్లంతా దులిపింది, బట్టలు మళ్ళీ మళ్ళీ మడతలు పెట్టి బీరువాలో సర్దింది. దుప్పట్లు మార్చింది. దిండు గలేబులు తొడగాలని దిండు కింద వేసి గలేబులు ఊడదీస్తోంటే, పాదాల దగ్గర పడింది దిండు కిందున్న కవరు.

కామాక్షమ్మ ఆ కవరు అటూ ఇటూ చూసింది. అదే, ఆరోజు పక్కింటి పిల్లాడు తెచ్చి ఇచ్చాడు. మర్చిపోయింది ఆ విషయం - కామాక్షమ్మ మంచం మీద కూర్చుని కవరు విప్పింది.

పదిహేనురోజులనాడొచ్చిన ఉత్తరం!! గబగబా అక్షరాలు దొర్లిపోతున్నాయి. మళ్ళీ మళ్ళీ చదివింది. కన్నీటి పొరతో మసకమసకాగా అక్షరాలు తెలియటం లేదు. కళ్ళు ఒత్తుకుంటూ మళ్ళీమళ్ళీ చదివింది అదే విషయం!!

వెంకటేశ్వరరావు అన్నయ్య మా పాలిట దేవుడు!!

బతికుండగానే స్నేహాలు గుర్తించని కాలంలో, చచ్చిపోయిన స్నేహితుడి కోసం, మా కుటుంబాన్ని ఆదుకున్న అన్నయ్యని వేం దీపం పెట్టి రోజూ పూజించుకుంటున్నాం!! -

మీ ఆడబిడ్డ లలితమ్మ మా పాలిట లలితాదేవి. ఆ అమ్మాయి దయతో, వాళ్ళ వారికి చెప్పి మా అబ్బాయికి ఉద్యోగం వేయించి మాకింత ఆధారం కల్పించింది ఆడబిడ్డ లలితమ్మ - కామాక్షమ్మ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి!!

ఉత్తరం చేతిలో అలాగేవుంది - ఆఖరి పేరాలో - "అయినా వదినా, నీలాంటి ఉత్తమురాలైన భార్య సహకరించకపోతే, ఏ భర్త అయినా ఒకరి కుటూంబానికి ఏ సహాయం చేయగలడూ! భర్త హఠాత్తుగా మరణించటంతో, అనాథనైన నన్ను ఆర్థికంగా, సహృదయంతో ఆదుకొన్న మీకు, ఎలా కృతజ్ఞతలు చెప్పగలనూ..."

కామాక్షమ్మ దిండులో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది... ఇంట్లో దేవుణ్ణి గుర్తించలేనిది తనే!! కామాక్షమ్మకి ఉన్నట్టుండి తులసమ్మ కామాక్షి బామ్మ గుర్తొచ్చింది.

"ఇది ఆ ఎదురింటి పక్కన పాకలో ఉన్న వీరన్నకియ్యి" అని ఆవకాయ ఓ గిన్నెలో పెట్టి పంపేది కామాక్షికి పద్నాలుగేళ్ళున్నప్పుడు.

"ఏమిటి బామ్మా... ఎందుకూ? నేనివ్వను వాడికి" అంటే - "పాపం, ఆడదిక్కులేని కొంప... ఇచ్చిరా.. అనేది. వీరన్న భార్య రెండు నెలలనాడు మరణించింది. బామ్మ ఎప్పుడూ ఎవరికో ఏదో సహాయం చేస్తూనే ఉండేది... అయ్యో అని, పాపం అని ఎవరిమీదో ఎప్పుడూ ఏదో జాలి, ప్రేమ కనబర్చేది. కామాక్షికి బామ్మ పద్ధతి చాలా కోపంగా ఉండేది.

"నలుగురికి సహాయం చేయకపోతే మనిషి జన్మెత్తి ఏం లాభం" అనే బామ్మ మాటలు కామాక్షికి నచ్చేవి కావు. బామ్మ అలా పంచిపెడుతుంటే మనకెలాగ అని ఆలోచించేది. ఇరుగు పొరుగులతో స్నేహంగా ఉండటం, ఒకరి కష్టసుఖాలు వినటం పరమ విసుగు. బామ్మ మాటలకి మండిపడిపోయేది ఆనాడు!!

కామాక్షమ్మ చేతిలో ఉత్తరం కదులుతూనే ఉంది. తులసమ్మ నవ్వుతున్నట్లుంది కళ్ళముందు!!

"మీ దంపతులు మా ఇంటికొస్తే పార్వతీపరమేశ్వరులే వచ్చారనుకుంటాను" కామాక్షమ్మకు కన్నీళ్ళాగలేదు.

లలితమ్మ నా ఆడబిడ్డా!!

నా భర్త సాక్షాత్తూ దేవుడా!!

ఉత్తరం చేత్తో పట్టుకుని దేవుని ముందుపెట్టి చెంపలేసుకుంది కామాక్షమ్మ.

గుమ్మంలోంచి బయటకి రాగానే ఎదురుగావున్న భర్తను చూడగానే తలదించుకుంటూ, చకచకా వంటింట్లోకెళ్ళిపోయింది కామాక్షమ్మ. రాత్రి భోజనాలయ్యాయి.

కామాక్షమ్మ మనసు ఆనందంతో పరవశించిపోతోంది. మల్లెపూలు కడుతూ, భర్త పక్కన కూర్చున్న కామాక్షమ్మ "మీరు, నేను, లలిత, వీణ విజయవాడ వెడదామండీ రేపు" అంది భర్త ముఖంలోకి చూస్తూ. "ఎవరున్నారు - ఎందుకలా?" అన్నాడు వెంకటేశ్వరరావు.

"మా ఆడబిడ్డ... అదే, సూర్యం భార్య జానకి" మల్లెపూల దండ సిగలో చుట్టుకుంటూ అంది.

"మీ ఆడబిడ్డా" వెంకటేశ్వరరావు ఫక్కున నవ్వాడు... పది నిమిషాల క్రితం మంచం మీద ఉత్తరం చదివి, అక్కడ పెట్టేసిన విషయం పాపం కామాక్షమ్మ కేం తెలుసూ!!

"అవును - మా ఆడబిడ్డే" కామాక్షమ్మ గలగలా నవ్వింది. వెన్నెల మరీ వెండిలా మెరిసింది. సిగలో మల్లెలు గుప్పుమన్నాయి.

- ఈనాడు ఆదివారం 12 సెప్టెంబరు 1999